ఘనంగా ఉగాది పర్వదిన పూజలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పంచాంగ శ్రవణానికి ఆసక్తి కనబర్చిన ప్రజలు

సత్తెనపల్లి: తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లను, పశువులు, జీవాలకు రంగులు పూసి అందంగా అలంకరించారు. ఉగాది పచ్చడి తయారు చేసి అందరికీ పెడుతూ ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వ్యాపారులు దస్త్రం పూజ, రైతులు ఏరువాక సాగి తమ పనులను ప్రారంభించారు. సాయంత్రం పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించి వేద పండితులతో రాశి ఫలాలు తెలుసుకున్నారు. సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వెంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది పర్వదినం పురస్కరించుకొని శ్రీవారికి విశేష అభిషేకం, అర్చన పూజాది కైంకర్యాలు నిర్వహించారు. శ్రీహరి వేదలను మత్స్యావతారంలో రక్షించింది ఉగాది నాడే అని పురాణ ఇతిహాసాల్లో కథనమని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీమాన్ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజ స్వామి తెలిపారు. అందుకే శ్రీహరిని మత్స్యావతారంలో అలంకరించి విశేష అర్చన చేశారు. ధర్మకర్తలు, శ్రీవారి సేవా సమాజం భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పర్యవేక్షించారు. అలాగే పట్టణంలోని వివిధ ఆలయాల్లో ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. మండలంలోని లక్కరాజు గార్లపాడు గ్రామం పట్టాభిరామ ఆలయంలో మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, సత్తెనపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి, కోమటినేని శ్రీనివాసరావు దంపతులు పూజలు నిర్వహించారు.



అనంతవరంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉగాది పూజలు



మత్స్యవతారంలో శ్రీవారు

క్రోసూరులో...

క్రోసూరు: ఉగాది పండుగను మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. మండలంలోని అనంతవరం గ్రామంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పురస్కరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.

ముప్పాళ్ళలో...

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో వేంచేసియున్న బలభద్ర సహిత జగన్నాథస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా తిరునాళ్ల నిర్వహించారు. ప్రభలను అంగరంగ వైభవంగా ఊరేగింపుగా ఆలయం వద్దకు తరలించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పొంగళ్లు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో కచేరిలు, మండపాల వద్ద పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ ఏడాది రాశి ఫలాలు, ఏయే పంటలు అనుకూలం లాంటి వివరాలు తెలుసుకునేందుకు గ్రామస్తులు ఆసక్తి కనబరిచారు. ముప్పాళ్ళలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, నార్నెపాడులోని భీమలింగేశ్వరస్వామి, మాదలలోని సంగమేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

పెదకూరపాడులో...

పెదకూరపాడు: విశ్వావసు నామ ఉగాది సంవత్సర వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పెదకూరపాడులోని నాగేంద్రస్వామి దేవాలయం, మహాలక్ష్మీ చెట్టు సెంటర్, రామాలయం, లగడపాడు శివాలయం, 75త్యాళ్ళూరు కోదండరామాలయంలో ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. 75 త్యాళ్ళూరులో జరిగిన వేడుకలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులతో దేవాలయాలు కిటకిటలాడాయి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో సత్యనారయణరెడ్డి పాల్గొన్నారు.



లక్కరాజుగార్లపాడులోని పట్టాభిరామ ఆలయంలో పూజల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

బెల్లంకొండ మండలంలో...

బెల్లంకొండ: నూతన తెలుగు సంవత్సరాది వేడుకలను మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉగాది పండుగ సందర్భంగా గ్రామాలలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఏడాది మొత్తం పాడి పంటలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. పూజారులు షడ్రుచుల సమ్మేళనం అయిన ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం వివిధ గ్రామాలలో 'విశ్వావసు' నామ సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని చంద్రాజుపాలెం, నాగిరెడ్డిపాలెం, గంగిరెడ్డిపాలెం, కందిపాడు, పాపాయపాలెం తదితర గ్రామాలలో పూజారులు పంచాంగాన్ని చదివి వినిపించారు. మొదట గ్రామాల పేరున పంచాంగాన్ని చదవగా తరువాత గ్రామ పెద్దలు, రైతుల పేరున పంచాంగాన్ని చదివించుకున్నారు.

వైభవంగా కందిపాడు వెంకటేశ్వరుని తిరునాళ్ల

మండలంలోని కందిపాడు గ్రామంలోని కొండ పైన గల వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఉగాది పర్వదినం రోజున ప్రతి ఏటా ఘనంగా తిరునాళ్లను నిర్వహిస్తారు. వివిధ గ్రామాల భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్లలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చెన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానాన్ని వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, సర్పంచ్ కంభంపాటి పాప, ప్రకాశ్, ఎంపీటీసీ రేగులగడ్డ తిరుపతమ్మ, మర్రి చంద్రారెడ్డి, శ్రీను, సర్పంచ్‌లు బాణావతు నరసింహానాయక్, కొడవటి బాబూజీ, దారం రమణారెడ్డి, నాయకులు మేకల వెంకటేశ్వర్లు, గాదెమిల్లు వెంకటరెడ్డి, గుడిశె నాగిరెడ్డి, ఎంపీటీసీలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



త్రిశక్తి దుర్గా పీఠంలో పంచాంగ శ్రవణంలో పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామి



75త్యాళ్ళూరు.. పంచాంగ శ్రవణంలో భక్తులు



కందిపాడులో వేంకటేశ్వరుని కల్యాణ వేడుకలో భక్తులు

క్లుప్తంగా

జాస్తి వీరాంజనేయులుకు ఉగాది పురస్కారం



అమరావతి: అమరావతి మండల పరిధిలోని పెదమద్దూరు గ్రామానికి చెందిన జాస్తి వీరాంజనేయులుకు ఉగాది పురస్కారం లభించటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడిగా సామాజిక సేవా రంగంలో ఉన్నతమైన సేవలను అందిస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు నందిస్తున్న వీరాంజనేయులుకు ఈ పురస్కారం లభించటంపై పెదమద్దూరు గ్రామస్తులు, మండల పరిధిలోని పలువురు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ పురస్కారం రావటం ఆనందంగా ఉందని భవిష్యత్‌లో కూడా సామాజిక సేవా రంగంలో తన సేవలు కొనసాగిస్తానని తెలిపారు.

గడియార స్తంభం వద్ద ఆర్యవైశ్యుల నిరసన



సత్తెనపల్లి: పట్టణంలోని గడియార స్తంభం అన్యమత ప్రచార స్తంభంలా మారిందని ఆవోపా పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో ల్యాండ్ మార్క్‌గా ఏర్పాటు చేసిన గడియార స్తంభం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆదివారం గడియార స్తంభం వద్ద ఆర్యవైశ్య నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గడియార స్తంభం వద్ద ఎలాంటి అన్యమత ప్రచారాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలు, గోశాల అధ్యక్షుడు పెండ్యాల కాశీమల్లేశ్వరరావు, యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్, కమిటీ సభ్యులు భవిరిశెట్టి రంజిత్ కుమార్, లఘువరపు రమేష్, కటకం చంద్ర, చిలకల వాసు, కనమర్లపూడి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో అన్న సంతర్పణ



సత్తెనపల్లి: నిరుపేదలను ఆదుకోవటమే నిజమైన పండుగ అని బీజేపీ సీనియర్ నాయకుడు పులిపాటి శ్రీరామమూర్తి అన్నారు. స్వచ్ఛంద పదవి విరమణ చేసిన ఎలక్ట్రికల్ ఏడీఈ బత్తుల శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఆదివారం 120 మంది నిరుపేద రోగులు, వారి సహాయకులకు జనసేన పార్టీ నాయకుడు అప్పాపురం నరేంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పథకంలో ఉగాది సందర్భంగా ఆదివారం అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నిరుపేదల ఆకలి తీర్చేందుకు సహకరించిన బత్తుల శ్రీనివాసరావు, వారి కుమారుడు బత్తుల దినేష్ కృష్ణకు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూరే రామకోటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, చేపూరి నాగేశ్వరరావు, కట్టమూరు అప్పారావు, కుంచన పల్లి శ్రీనివాసరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

ఏపీ పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్



సత్తెనపల్లి: సమస్యలు వచ్చినప్పుడు కుంగిపోకుండా లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలని ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది చిలుకా చంద్రశేఖర్ అన్నారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని సత్తెనపల్లికి చెందిన మాజీ కౌన్సిలర్ ఉల్లం ఝాన్సీలక్ష్మీబాయ్ తన తండ్రి సత్యనారాయణ స్మృత్యర్థం బీ.ఫార్మసీ విద్యార్థిని గంటా సుజితకు ఆదివారం ల్యాప్‌టాప్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్ని ఆటు పోట్లు ఎదురైనా విద్యను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. విద్య ద్వారానే గౌరవ మర్యాదలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా బీ.ఫార్మసీ విద్యార్థిని గంటా సుజితకు ల్యాప్‌టాప్ అందించి అభినందించారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది ఉల్లం శేషగిరిరావు, పుచ్చకాయల సత్యవతి తదితరులు ఉన్నారు.

నేడు పవిత్ర రంజాన్



విద్యుద్దీపాలతో గుండ్లపల్లిలోని పెద్ద మసీదు



ముస్తాబైన నకరికల్లులోని కొండపై గల 70 ఏళ్ల ఈద్గా



పెదకూరపాడులోని విద్యుత్ దీపాలతో ముస్తాబైన మక్కా మసీదు

నకరికల్లు: పవిత్ర రంజాన్ మాసం ఆదివారంతో ముగియడంతో సోమవారం రంజాన్ పర్వదినాన్ని జరుపుకునేందుకు ముస్లింలు సన్నద్ధమయ్యారు. ఆకలి అంటే తెలియని ఆగర్భ శ్రీమంతులకు సైతం ఆ బాధను అనుభవపూర్వకంగా తెలియజెప్పేవి ఉపవాసదీక్షలు. సమాజంలోని పేదల పట్ల జాలి, దయ చూపడం లాంటి గుణాలను నేర్పే మాసం రంజాన్. దానధర్మాలు, పరమత సహనం, పరుల క్షేమం, చెడు నుంచి విమోచనం లాంటి గొప్ప సద్గుణాలను రంజాన్ మాసం నేర్పిస్తుంది. ఇంతటి గొప్ప గుణగణాలు నేర్పే మాసంలో నెల రోజుల ఉపవాస దీక్ష ఆదివారం చంద్రవంక దర్శనంతో ముగిసింది. రంజాన్ పర్వదినానికి నకరికల్లులోని కొండపై గల 70 ఏళ్ల పైబడిన ఈద్గా, చల్లగుండ్ల, గుండ్లపల్లి, కుంకలగుంట,

ముస్తాబయిన ఈద్గాలు, మసీదులు

చేజర్ల, చీమలమర్రి, దేచవరం గ్రామాల్లోని ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈదుల్ ఫితర్ సామూహిక నమాజు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: పవిత్ర రంజాన్ పండుగకు మండలంలోని మసీదులు విద్యుత్ దీపాలతో ముస్తాబయ్యాయి. మండలంలోని పెదకూరపాడు, పాటిబండ్ల, లగడపాడు, తమ్మవరం, చిన్నమక్కెన, కన్నెగండ్ల, పొడపాడు గ్రామాల్లో మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం ఉదయం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

కనిపించిన నెలవంక

క్రోసూరు: ముస్లింలు పవిత్ర రంజాన్ పండుగను సోమవారం నిర్వహించుకోవాలని మత పెద్దలు జమాలుద్దీన్ ఆదివారం సాయంత్రం తెలిపారు. 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టిన అనంతరం నెలవంక చూసి మరుసటిరోజు పండుగ నిర్వహించుకుంటారు. నెలవంక కనిపించినట్లు మత పెద్దలు ప్రకటించటంతో రంజాన్ పండుగ నిర్వహించుకోవడానికి ముస్లింలు సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసరాలు అందజేత

క్రోసూరు: క్రోసూరులోని కొంతమంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. క్రోసూరులోని చప్టా దగ్గరి మసీదు వద్ద పల్నాడు జిల్లా ముస్లింల సంఘం అధ్యక్షుడు అమీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రోసూరు జెడ్పీటీసీ షేక్ గఫూర్, పలువురు పెద్దలు పాల్గొని సరుకులు అందజేశారు.

వీఆర్‌కు క్రోసూరు ఎస్‌ఐ నాగేంద్రరావు

క్రోసూరు: క్రోసూరు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ నాగేంద్రరావును వీఆర్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు నుంచి ఆదేశాలొచ్చినట్లు సీఐ పి.సురేష్ ఆదివారం తెలిపారు. ఎన్నికల తరువాత జరిగిన సాధారణ బదిలీల్లో ఎస్‌ఐ క్రోసూరుకు వచ్చారు. ప్రస్తుతం వీఆర్‌కు పంపిన కారణాలు తెలియరాలేదు. ఇంకా ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదని తెలిసింది.

భక్తిశ్రద్ధలతో పేరంటాళమ్మతల్లి తిరునాళ్ల



పేరంటాళమ్మతల్లి



వాసవీక్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు వేపపూత ప్రసాదం పంపిణీ

- పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్న భక్తులు
- పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు

అచ్చంపేట: ఉగాది మహోత్సవాలలో భాగంగా స్థానిక అచ్చమ్మ పేరంటాళమ్మతల్లి దేవాలయంలో తిరునాళ్ల మహోత్సవాలు మూడవరోజు ఉగాది నాడు వైభవంగా జరిగాయి. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయం వద్ద పొంగళ్లు పొంగించుకుని అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు కూరపాటి మల్లిఖార్జునరావు, రామకిరణ్‌గార్లచే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా విభాగం లలిత సహస్ర నామ పారాయణ, భజన కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారికి కర్పూర హారతులిచ్చారు. దేవాలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు సూరే సుబ్బారావు ఆధ్వర్యంలో వేపపూత ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

వాసవీ క్లబ్ వారిచే..

ఉగాది ఉత్సవాలలో భాగంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు స్థానిక ఆంజనేయస్వామి విగ్రహం వద్ద శ్రీవాసవీ క్లబ్ వారిచే వేపపూత ప్రసాద పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వాసవీ క్లబ్ సభ్యులంతా సేవా దృక్పథంతో పని చేయాలని క్లబ్ రాష్ట్ర ప్రముఖులు సూరే వెంకటకోటిలింగం తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రముఖులు అడ్డగిరి వెంకటసాయి పార్థసారధి, అనుముల శేషగిరి, కొప్పరావూరి మురళీకృష్ణ, ఏలూరి శ్రీనివాసరావు, భవిరిశెట్టి రవికుమారు, వీరవల్లి శ్రీనివాసరావు, బుర్లె నరసింహారావు, వాసవీ వనిత అధ్యక్షులు పులిపాటి పద్మ, అన్నవరపు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన డాక్టర్ గజ్జల

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెంలో షేక్ అక్బర్ జ్ఞాపకార్థం కుమారులు కమల్ బాషా, సైదాలు మంచినీటి చలివేంద్రంను ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రంను సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, నాయకులతో కలసి ఆదివారం ప్రారంభించారు.

చలివేంద్రం ఏర్పాటు చేసిన కమల్ బాషాకు, సైదాలుకు గజ్జల అభినందనలు తెలిపారు. ఆయన వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ వేల్పుల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు మెల్లంకొండ హుస్సేన్, బత్తుల సాంబశివరావు, మాజీ సర్పంచ్ పశ్యావుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలి వేంద్రం ప్రారంభం

పెదకూరపాడు: నేటి సమాజంలో అంతరించిపోతున్న భూగర్భ జలాలతో భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రతి ఒక్కరు నీటిని పొదుపు చేయాలని ఆడిట్ డిపార్ట్‌మెంట్ స్టేట్ డైరెక్టర్ కొర్లకుంట సుబ్బారావు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో సత్తెనపల్లి–అమరావతి కాలచక్ర రహదారిలో స్థానిక జనచైతన్య సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుతున్న ఎండలకు ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు జనచైతన్య సమితి ఏర్పాటు చేసిన చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఏడాది ప్రయాణికుల కోసం సమితి నిర్వాహకులు మజ్జిగ, మంచినీటి చలివేంద్రలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. మాజీ సర్పంచ్‌లు తోట శ్రీనివాసరావు, పరుచూరి పూర్ణచంద్రరావులు మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా జనచైతన్య సమితి అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకులు తుళ్లూరి సాంబశివరావు, కొర్రపాటి వెంకటేశ్వర్లు, అమృత ల్యాబ్ నిర్వాహకులు చిరుమామిళ్ల లియాఖాన్, విప్పర్ల శ్రీనివాసరెడ్డి, అనిల్‌కుమార్, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.



పెదకూరపాడులో చలివేంద్రం ప్రారంభిస్తున్న కొర్లకుంట సుబ్బారావు

కళాకారులకు సత్కారం

సత్తెనపల్లి: కళలను నైపుణ్యంతో చురుగ్గా ప్రదర్శించే వారే కళాకారులని ఉషోదయ కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య అన్నారు. విశ్వావసు నామ తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఉషోదయ కళాపరిషత్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో, వివిధ కళల్లో నైపుణ్యం సంపాదించిన కళాకారులు ఎలిశెట్టి వెంకటప్రసాద్, శిఖా ఆదాం, మండ్ల నరసింహ ప్రసాద్‌లను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా పాములయ్య మాట్లాడుతూ కళాకారుల ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా ముగ్గురు కళాకారులను పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కుమ్మరి దస్తగిరి, కళాకారులు మాతంగి సాంబశివరావు, బత్తినేని వెంకటలక్ష్మయ్య, డాక్టర్ సరికొండ రమాదేవి, పాత్తూరి రామకోటయ్య, పిలుట్ల ఆంజనేయులు, సిరిగిరి వెంకట్రావు, తమలపాకుల రవి కిషోర్, కాటుమాల నాగేశ్వరరావు, గుండవరపు అమర్‌నాథ్, గుంటూరు గోవింద్, చింకా అంకమ్మరావు, పిక్కల రత్తయ్య, విప్పర్ల కొండలు, పిక్కిలి శివ తదితరులు ఉన్నారు.



సత్కారం అందుకున్న కళాకారులతో ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య

అక్షయపాత్ర వంట గదికి శంకుస్థాపన

నరసరావుపేట రూరల్: అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించే కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. మండలంలోని కేసానుపల్లి సమీపంలో కేంద్రీకృత వంటగది నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, అక్షయపాత్ర ప్రాంతీయ అధ్యక్షుడు వంశీధర దాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఈ ప్రాంతానికి అక్షయపాత్రను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. పరిశుభ్రమైన పోషకాహారం మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అందుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఐదువేల మందికి భోజనాన్ని అందించేలా కిచెన్ నిర్మితం కానుందన్నారు. విస్తరణకు దాతలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎఎం కళాశాల అధ్యక్షుడు ఎంపీ శేషగిరిరావు, నల్లపాటి రామచంద్రప్రసాద్, కపలవాయి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని కోటబజార్ పులుపుల వారి వీధిలోని శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పలువురు భక్తులు విరాళాలను అందించారు. పట్టణానికి చెందిన అర్వపల్లి హరివిజయకుమార్, రామ్‌ప్రతాప్‌కుమార్‌లు రూ. 2,01,116, కొత్తూరి శ్రావణ్‌కుమార్, నాగలక్ష్మీ దంపతులు రూ.1,00,116, పులిపాటి వెంకటేశ్వర రుక్మాంగదరావు, వెంకట అనూరాధ దంపతులు రూ.1,01,116, చలువాది వెంకట అయ్యప్ప పృథ్వీరాజ్ గుప్త, మౌనిక దంపతులు రూ.51,116 విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వనమా కృష్ణ, కోవూరి శివశ్రీనుబాబు, వనమా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.